పాఠశాల సందర్శన

నార్నూర్, నవంబర్ 27 : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తహసీల్దార్ జాడి రాజాలింగం, ఎంపీడీవో జవహర్‌లాల్ బుధవారం సందర్శించారు. మధ్యాహ్నం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం రోజు వారిగా విద్యార్థులకు రుచికరమైన భోజనం వడ్డించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వారి వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆన్‌లైన్ కేంద్రం పరిశీలన

నార్నూర్, నవంబర్ 27 : మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ కేంద్రాన్ని బుధవారం డివిజన్ పంచాయతీ అధికారి ప్రభాకర్ పరిశీలించారు. సమగ్ర కుటుంబ సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసేటప్పుడు తప్పులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో జవహర్‌లాల్, ఎంపీవో స్వప్నశీల, సిబ్బంది ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణను నిలిపివేయాలి

పెంబి, నవంబర్ 27: ఎస్సీ వర్గీకరణను నిలిపివేయాలని మాల ఉపకులాల మండలాధ్యక్షుడు మల్లపల్లి స్వామి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎస్సీ మాల ఉపకులాల సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాలల సింహగర్జనకు మాల ఉపకులాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్, ధర్మరాజు, సందీప్, అశోక్, చిట్టి పాల్గొన్నారు.

29న మండల స్థాయి గణిత ప్రతిభా పరీక్ష

నిర్మల్ చైన్‌గేట్, నవంబర్ 27 : ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస్ రామానుజన్ జయంతి పురస్కరించుకుని నిర్మల్ జిల్లా గణిత ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన మండల స్థాయి గణిత ప్రతిభ పరీక్షను ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు నిర్వహించనున్నట్లు గణిత ఫోరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చట్ల శ్రీనివాస్, మనోహర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఉదయం 11 నుంచి 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేస్తామని తెలిపారు.

పత్తి కొనుగోళ్లు నిలిపివేత

బోథ్, నవంబర్ 27 : బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలోని సీసీఐ కేంద్రాల్లో చేపడుతున్న పత్తి కొనుగోళ్లను ఈ నెల 28 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి విఠల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పత్తి నిల్వలు అధికంగా ఉన్నందున బోథ్‌లోని రాఘవేంద్ర, సాయిదత్త, పొచ్చెరలోని సాయిబాబా జిన్నింగ్ ఫ్యాక్టరీలో కొనుగోళ్లు ఉండవని పేర్కొన్నారు. డిసెంబర్ 2 నుంచి కొనుగోళ్లు యథావిధిగా జరుగుతాయని తెలిపారు. రైతులు సహకరించాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

సోన్, నవంబర్ 27 : నిర్మల్ మండలం మేడిపెల్లి గ్రామానికి చెందిన ముచ్చిండ్ల నారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను బుధవారం మాజీ ఎంపీపీ సత్యనారాయణగౌడ్ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు లవకుమార్‌గౌడ్, శ్రావణ్, శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, మధుకర్, ప్రవీణ్, వినేశ్ ఉన్నారు.

వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

కడెం, నవంబర్ 27 : పదో తరగతిలో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్మల్ డీఈవో రామారావు ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం కడెంలోని జడ్పీ పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడిన అనంతరం ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు వచ్చేలా చూడాలని, ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట జీసీడీవో సలోమి కరుణ, సెక్టోరల్ అధికారి లింబాద్రి, మండల విద్యాధికారి షేక్ హుస్సేన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

లక్ష్మణచాంద(మామడ), నవంబర్ 27: విద్యార్థులు ఇష్టపడి చదవడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధిస్తారని నిర్మల్ డీఈవో రామారావు పేర్కొన్నారు. మామడలోని ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు బోధించే బోధనను అవగాహన చేసుకుని చదవాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహించే ప్రత్యక తరగతులను సద్వినియోగంచేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ప్రతి రోజూ ప్రత్యేక తరగతులకు హాజరయ్యేలా చూడాలని ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులకు సూచించారు.

సర్వే డాటాను పకడ్బందీగా నమోదు చేయాలి

ముథోల్, నవంబర్ 27 : గ్రామాల్లో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే డాటాను పకడ్బందీగా నమోదు చేయాలని డీఎల్‌పీవో సుదర్శన్ పటేల్ అధికారులకు సూచించారు. బుధవారం ముథోల్‌లోని మండలాభివృద్ధి కార్యాలయంలో ఏర్పాటు చేసిన డాటా ఎంట్రీ సెంటర్‌ను పరిశీలించి వారికి పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. ఆయన వెంట ఎంపీడీవో శివకుమార్ ఉన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఎదులాపురం, నవంబర్ 27 : జిల్లా వ్యాప్తంగా కోర్టుల్లో డిసెంబర్ 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. బుధవారం ఆదిలాబాద్‌లోని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఛాంబర్‌లో డీఎల్ఎస్ఏ కార్యదర్శి బోనగిరి సౌజన్యతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీపడ్డ దగ్గ కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకుంటే కక్షిదారులు ఇద్దరు విజయం సాధించడంతో పాటు కోర్టుకు చెల్లించిన రుసుమును సైతం తిరిగి చెల్లిస్తారని పేర్కొన్నారు. ఇది వరకు బ్యాంకర్లు, ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు, న్యాయవాదులు, ఆర్టీసీ, తదితరులతో సమావేశం నిర్వహించామన్నారు. లోక్ అదాలత్‌ను ప్రజలు విజయవంతం చేయాలన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

బేల, నవంబర్ 27 : విద్యార్థులు తమ ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటిస్తూ చదువులో రాణించాలని జిల్లా మహిళా సాధికారత కోఆర్డినేటర్ యశోద అన్నారు. ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా బుధవారం బేలలోని కేజీబీవీలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సఖీ కేంద్రం సిబ్బంది లావణ్య, సంఘమిత్ర లీగల్ కౌన్సిలర్లు, కేజీబీవీ ప్రత్యేకాధికారి నవీన, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

తలమడుగు, నవంబర్ 27: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ డీఎస్పీ హసీబుల్లా ఖాన్ అన్నారు. బుధవారం భరంపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సూర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. బాల్య వివాహాల నిర్మూలన, సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సి జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ అంజమ్మ తెలిపారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి



బైంసా: మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

బైంసా, నవంబర్ 27 : నిర్మల్‌లో ఈ నెల 29వ తేదీన నిర్వహించే దీక్షా దివస్‌కు వేలాది మంది తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కిరణ్ కొమ్రేవార్, విలాస్ గాదేవార్ పిలుపునిచ్చారు. బుధవారం బైంసాలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ చేపట్టిన అమరణ దీక్షతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై డిసెంబర్ 9వ తేదీన కేంద్రం కదిలివచ్చి రాష్ట్ర ప్రకటన చేసిందని గుర్తు చేశారు. తెలంగాణ సాధనకు కేసీఆర్ చేపట్టిన ఈ దీక్ష చరిత్రలో నిలిచిపోతుందన్నారు. అంతేగాకుండా ముథోల్ నియోజకవర్గంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం మూడు కొత్త మండలాలు ప్రకటిస్తే ఇప్పుడు వాటి ఊసే లేదన్నారు. ప్రస్తుతం ఉన్న పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఒత్తిడి తీసుకువచ్చి పల్సీని మండలంగా ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజలకు మంచికంటే చెడే ఎక్కువ జరిగిందన్నారు. ఇప్పటికి ప్రభుత్వం రైతుభరోసా ఇవ్వకుండా రైతుల నోట్ల మట్టి కొట్టిందన్నారు. సమావేశంలో నాయకులు దేవీదాస్, పోశెట్టి, మహేశ్ పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి

ఎదులాపురం, నవంబర్ 27 : ఆదిలాబాద్‌లో బాశెట్టి మాధవరావు విజ్ఞాన కేంద్రం, సీఐటీయూ జిల్లా కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ అన్నారు. స్థానిక ఆర్ అండ్ బీ గెస్ట్ హౌజ్ వద్ద నిర్వహించనున్న సభ ఏర్పాట్లను బుధవారం నేతలతో కలిసి పరిశీలించారు. గురువారం నిర్వహించే సభకు ముఖ్య అతిథులుగా సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు బృంద కారత్‌తో పాటు సీఐటీయూ ఆల్ ఇండియా నాయకులు సాయిబాబా, సీపీఎం మాజీ పార్లమెంట్ సభ్యులు మీడియం బాబురావ్, చెరుపల్లి సీతారాములు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ హాజరవుతున్నారని తెలిపారు.

ఇంద్రవెల్లి, నవంబర్ 27: ఆదిలాబాద్‌లో బాశెట్టి మాధవరావు విజ్ఞాన కేంద్రం, సీఐటీయూ జిల్లా కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా ఈ నెల 28వ తేదీన నిర్వహించే బహిరంగ సభకు గ్రామ పంచాయతీ కార్మికులతోపాటు రైతులు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని సీఐటీయు జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న పిలుపునిచ్చారు. బుధవారం ఇంద్రవెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో జీపీ కార్మికులతో కలిసి పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలు కత్తి మల్లమ్మ, కార్మికులు మీరాబాయి, లక్ష్మికాంత్, సంజీవ్, రాందాస్ పాల్గొన్నారు.

కార్పొరేట్లకు కొమ్ము కాస్తున్న బీజేపీ సర్కార్

మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్

ఎదులాపురం, నవంబర్ 27 : కేంద్రంలోని బీజేపీ సర్కార్ కార్పొరేట్లకు కొమ్ము కాస్తోందని, అదానీ, అంబానీ వంటి పారిశ్రామిక వేత్తలు, బడా వ్యాపారవేత్తలకు మద్దతుగా విధానాలను అవలంబిస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్ విలాస్ ఆరోపించారు. ఆదిలాబాద్‌లోని సీపీఐ కార్యాలయంలో బుధవారం ఏఐటీయూసీ జిల్లా అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా దేశంలో కేంద్రం నాలుగు కార్మికల చట్టాలను తీసుకొచ్చిందన్నారు. ఈ చట్టాలను రద్దు చేయాలని ఎన్నో ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపట్టినా ఎలాంటి స్పందన లేదన్నారు. ప్రధాని మోదీ కార్మిక వ్యతిరేకి అని దుయ్యబట్టారు. ఈ చర్యను కార్మికవర్గం తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు విడనాడాలని డిమాండ్ చేశారు.

మోడల్ లైబ్రరీ ప్రారంభం

బైంసాటౌన్, నవంబర్ 27: దేగాం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో రూమ్ టూ రీడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మోడల్ లైబ్రరీని బుధవారం ఎంఈవో సుభాష్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జామ్‌లో ఐపీఎస్, ఐఎఫ్ఎస్ శిక్షణాధికారులు పర్యటన

శిక్షణాధికారులకు పథకాలు వివరిస్తున్న ఎంపీవో నజీర్‌ఖాన్

సారంగాపూర్, నవంబర్ 27 : జామ్ గ్రామంలో బుధవారం ఐపీఎస్, ఐఎఫ్ఎస్ శిక్షణాధికారులు పర్యటించారు. సెగ్రిగేషన్ షెడ్డు, నర్సరీ, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, గురుకులాన్ని సందర్శించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆరోగ్య, ఐసీడీఎస్, వ్యవసాయ శాఖ, పంచాయతీ రాజ్, ఉపాధి హామీ, ఐకేపీ శాఖలపై నిర్వహించిన సమావేశానికి హాజరయ్యారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల తీరును ఎంపీవో నజీర్‌ఖాన్ శిక్షణాధికారులకు వివరించారు. ఐకేపీ మహిళలు ప్రభుత్వం ద్వారా పొందిన రుణాలు ఎలా వినియోగించుకుంటున్నాయో తెలిపారు. గ్రామ పంచాయతీ వద్ద మొక్కలు నాటారు. ఐకేపీ మహిళలు తయారు చేసిన వివిధ రకాల వస్తువులను పరిశీలించి అడిగి తెలుసుకున్నారు. గురుకుల విద్యాలయం, జిల్లా పరిషత్ సెకండరీ సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. వారి వెంట జడ్పీసీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, డీఎల్‌పీవో రమేశ్, ఎంపీడీవో లక్ష్మీకాంత్ రావు, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీవో నజీర్ ఖాన్, ఏపీవో లక్ష్మారెడ్డి, ఏపీఎం మధురి, హెల్త్‌సూపర్ వైజర్ కృష్ణమోహన్‌గౌడ్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాధిక, హెచ్ఎం జనార్దన్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య

బైంసాటౌన్, నవంబర్ 27 : అనారోగ్యంతో బాధపడుతూ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నిర్మల్ జిల్లా బైంసా మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామోల్ గ్రామానికి చెందిన విఠల్(60) కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో ఆర్థిక సమస్యలు పెరిగిపోయి, మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది గ్రామ పోచమ్మ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బైంసారూరల్ పోలీసులు తెలిపారు. మృతునికి ఒక కొడుకు, కుతూరు ఉన్నారు

మద్యానికి బానిసై..

తాంసి(భీంపూర్), నవంబర్ 27: మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం నిపానిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..అరిగెల ఆశన్న–నర్సమ్మ కూలీ దంపతుల కుమారుడు మణికంఠ(27) కొన్నేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది బుధవారం ఇంటి వద్ద ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కలీం తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఇవ్వండి

పీఎం నరేంద్ర మోదీతో ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

బైంసా, నవంబర్ 27 : తెలంగాణ బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీతో బుధవారం భేటి అయ్యారు. వారితో పాటు ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ ఢిల్లీకి బయలు దేరి ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిశారు. ముథోల్ నియోజకవర్గం వెనుకబడిన ప్రాంతమని , కేంద్రం నిధులు ఇచ్చి తమ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. దేశంలోనే ప్రసిద్ధిగాంచిన చదువుల తల్లి బాసర జ్ఞాన సరస్వతీ అమ్మవారి దర్శనానికి రావాలని ఎమ్మెల్యే ఆహ్వానించారు. సీఎస్ఆర్ నిధులు అంతర్‌రాష్ట్ర రహదారుల నిర్మాణానికి నిధులు ఇవ్వడంతో పాటు ఉపాధి హామీ పథకంలో పెద్ద మొత్తంలో నిధులు ఇవ్వాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. సంబంధిత శాఖ మంత్రులకు తెలియజేసి ప్రత్యేక నిధులు కేటాయించేటట్లు చూస్తానని అన్నట్లు ఎమ్మెల్యే పటేల్ తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ప్రధానికి వివరించినట్లు చెప్పారు. అనంతరం ఎంపీలు, ఎమ్మెల్యేలు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని కలిశారు. నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలు కేంద్రమంత్రికి ఎమ్మెల్యే పటేల్ విన్నవించారు.

1న సింహగర్జన సభ

పోస్టర్ విడుదల చేస్తున్న మాల సంక్షేమ సంఘం నాయకులు

బోథ్, నవంబర్ 27: హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో డిసెంబర్ 1వ తేదీన నిర్వహించనున్న మాలల సింహగర్జన బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం సొనాలలో నాయకులు విడుదల చేశారు.ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ఎలక రాజు మాట్లాడుతూ సభకు మాలలు, మాల ఉప కులాలు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బూర్గుల సందీప్, ప్రధాన కార్యదర్శి మొరుగు ప్రభాకర్, కోశాధికారి లక్ష్మణ్, జాయింట్ సెక్రటరీ సోమన్న, సుధాకర్, సురేందర్, ఊశన్న, అధ్యక్షుడు స్వామి, ఉపాధ్యక్షుడు సంతోష్, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు బత్తుల ప్రవీణ్, మహార్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు భీంరావ్ పాటిల్, మల్లయ్య, మాజీ అధ్యక్షుడు బత్తుల రమేశ్, పొచ్చెర, కౌట గ్రామాల కమిటీలు సభ్యులు పాల్గొన్నారు.

తుకారాం వర్ధంతికి రావాలని ఆహ్వానం

మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు

ఉట్నూర్ రూరల్, నవంబర్ 27 : లక్షెట్టిపేట గ్రామంలో గురువారం నిర్వహించే ఆదివాసీ తొలి ఐఏఎస్ అధికారి మడావి తుకారాం 26వ వర్ధంతికి రావాలని బుధవారం మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్ రావ్‌కు ఆహ్వాన కమిటీ నాయకులు ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో రాయిసెంటర్ సార్‌మేడి సలాం శ్యాంరావ్, సభ్యులు జనార్దన్, ఆనంద్‌రావ్ పాల్గొన్నారు.

ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని వీక్షిస్తున్న అధికారులు

ఎదులాపురం, నవంబర్ 27 : నేషనల్ కమిషనర్ ప్రొడక్షన్ ఆఫ్ చైల్డ్ లైట్స్ (ఎన్సీపీసీఆర్) న్యూఢిల్లీ నుంచి బాల్య వివాహ ముక్తభారత్ కార్యక్రమాన్ని వీడియోకాన్ఫరెన్స్ ద్వారా చేపట్టారు. బుధవారం బాల రక్షక్ భవన్‌లో ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని జిల్లా సంక్షేమ అధికారి సబితా, బాలల సంక్షేమ సమితి చైర్మన్ వెంకటస్వామి, మెంబర్ దశరథ్, డీసీపీవో రాజేంద్రప్రసాద్, సూర్ ఎన్జీవో సంస్థ ప్రతినిధి గోపాల్ రెడ్డి, పీవైసీ స్వామి, ఎల్సీపీవో కుట్ల రమేశ్, డీసీపీయూ, చైల్డ్ లైన్ సిబ్బంది వీక్షించారు.

పాఠశాల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్

ఎదులాపురం, నవంబర్ 27: ఆదిలాబాద్ రూరల్ మండలం అంకోలి గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం పాఠశాల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సైన్స్ అధికారి రఘు రమణ, జిల్లా విద్యా శాఖ కార్యాలయ ప్లానింగ్ కోఆర్డినేటర్ నారాయణ హాజరై మాట్లాడారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్, ఫిజిక్స్‌కు సంబంధించి ప్రయోగాలను చూసి వారిలో శాస్త్రీయ దృక్పథం, మూఢ నమ్మకాలను పారదోలడం, సైన్స్‌పై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కంటె నర్సయ్య, సువార్త, పవన్, సీఆర్పీ రాజేశ్వర్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల నిరసన

ఉట్నూర్: నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఉట్నూర్, నవంబర్ 27: ఉట్నూర్‌లోని కేజీబీవీలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు బుధవారం మధ్యాహ్న సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కుమ్ర శ్రీనివాస్ మాట్లాడుతూ కేజీబీవీ ఉద్యోగుల తమ న్యాయమైన డిమండ్లు పరిష్కరించాలన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఉన్నప్పుడు కేజీబీవీ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఆ మాటలకు కట్టుబడి ఉండాలన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు ఆత్రం జంగు, ప్రధాన కార్యదర్శి చౌహాన్ రవీందర్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సువర్ణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

కుంటాల: నిరసన వ్యక్తం చేస్తున్న కల్లూరు కేజీబీవీ సిబ్బంది

ఎంటీఎస్ అమలు చేయాలి

కుంటాల, నవంబర్ 27 : ఎంటీఎస్ అమలు చేయాలని, తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని కల్లూరు కేజీబీవీలో బోధన, బోధనేతర సిబ్బంది బుధవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీఎస్ యూటీఎఫ్ సంఘం పిలుపు మేరకు అన్ని కేజీబీవీలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. రేపు కూడా నిరసన కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్టు సిబ్బంది తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

లోకేశ్వరం, నవంబర్ 27 : రాయపూర్ కాండ్లి గ్రామంలో రైతు జాదవ్ వెంకటేశ్‌కు చెందిన గేదె బుధవారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. గేదె విలువ రూ.80 వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

వేంకటేశ్వర కాలనీలో చోరీ

బాసర, నవంబరు 27 : బాసర మండలంలోని వేంకటేశ్వర కాలనీలో సోమవారం అర్ధరాత్రి చోరి జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... అమ్మవారి ఆలయంలో విధులు నిర్వహించే ప్రసాద్ ఇంట్లోకి చొరబడిన దొంగలు బీరువా తాళాలు పగులగొట్టి రూ. 10వేలు అపహరించారు. అదే విధంగా పలు ఇండ్లలో చోరీకి పాల్పడ్డారు. ఈ విషయం సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.

తహసీల్దార్‌కు వినతి

బైంసా, నవంబర్ 27 : బైంసాలోని పాత సినిమా థియేటర్ సమీపంలో లాండ్రీ షాపు దగ్ధం కావడంతో తమను ఆదుకోవాలని బుధవారం తహసీల్దార్ ప్రవీణ్ కుమార్‌కు వినతి పత్రం అందించారు. రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లిందని నష్టపరిహారం అందేలా చూడాలని కోరారు.

ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ

బోథ్, నవంబర్ 27 : సొనాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ చేపట్టారు. బస్టాండ్ చౌరస్తా వద్ద నృత్యం చేస్తూ ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనార్థలను ప్రజలకు వివరించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిసెంబర్ 1న సంస్మరణ సభ

ఉట్నూర్ రూరల్, నవంబర్ 27: అనారోగ్యంతో మృతి చెందిన ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉయిక సంజీవ్ సంస్మరణ సభ డిసెంబర్ 1న మండల కేంద్రంలోని కుమ్రం భీం కాంప్లెక్స్‌లో గల సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ కుడ్మెత తిరుపతి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉద్యమ నేతలు, తుడుందెబ్బ నాయకులు తరలిరావాలని కోరారు.

బేలలో డిగ్రీ పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయాలి

అంతర్రాష్ట్ర రోడ్డుపై ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

బేల, నవంబర్ 27: బేలలో డిగ్రీ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ చేపడుతున్న నిరసనలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగానే బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో అంతర్రాష్ట్ర రహదారిపై నాయకులు విద్యార్థులు ధర్నా చేపట్టారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి వారికి మద్దత